AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
30-9-2025 (Tuesday) MAIN EDITION

## జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే..: మహేశ్‌గౌడ్



**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తమ అభ్యర్థి మంచి మెజారిటీతో గెలుస్తారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ విజయకేతనం ఎగుర వేస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలు అమలు చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

## హైదరాబాద్ సీపీగా సజ్జనార్ బాధ్యతలు




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా వీసీ సజ్జనార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల ఆయనను సీపీగా నియమించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఇటీవల ట్రాన్స్‌ఫర్ చేసింది. ఇందులో భాగంగా ఆర్టీసీ ఎండీగా కొనసాగున్న సజ్జనార్‌ను సీపీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## జీహెచ్ఎంసీ ఉద్యోగులకు శుభవార్త




అక్షరటుడే, హైదరాబాద్: దసరా సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలో పని చేసే సిబ్బందికి గుడ్‌న్యూస్ చెప్పింది. ఉద్యోగుల కోసం జీవిత బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. రూ. 30 లక్షల నుంచి రూ. 1.25 కోట్ల వరకు బీమా కల్పించనుంది. ఇందుకోసం పీఎన్‌బీతో జీహెచ్ఎంసీ ఒప్పందం చేసుకుంది.

## ఓజీపై చిరు ప్రశంసల జల్లు



అక్షరటుడే, సినిమా డెస్క్: పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ'పై మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. కుటుంబంతో కలిసి ఈ సినిమాను వీక్షించిన ఆయన.. ఇది ఒక హాలీవుడ్ స్థాయిలో తీసిన అండర్‌వరల్డ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా అంటూ ప్రశంసలతో ముంచెత్తారు. 'ప్రతి సీన్ ఎంజాయ్ చేశాను. దర్శకుడు సుజీత్ ప్రతిభ అసాధారణం' అని పేర్కొన్నారు.

## ఆగని పసిడి పరుగులు



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కొన్ని రోజులుగా రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. మంగళవారం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,18,831, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,08,845గా ట్రేడ్ అయ్యింది. ఇక కేజీ వెండి ధర రూ. 1,61,000 పలికింది. దీంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.



స్థానిక సం'గ్రామానికి' తెర లేచింది. అక్టోబర్ 9 నుంచి పల్లెల్లో పోరు మొదలుకానుంది. దీంతో ప్రధాన పార్టీలు ఎన్నికల సన్నద్ధతపై దృష్టి సారించాయి. మెజార్టీ స్థానాల్లో గెలిచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగనున్న తరుణంలో ఎలాగైనా పట్టు నిరూపించుకోవాలన్న భావనతో పక్కా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ పల్లెల్లో పాగా వేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాయి. నియోజకవర్గాలు, మండలాల వారీగా ముఖ్య నాయకులకు బాధ్యతలు అప్పగించడంతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులపై ఫోకస్ చేశాయి. –అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# సం'గ్రామానికి' సన్నద్ధం..

- ఎన్నికల సన్నాహాల్లో ప్రధాన పార్టీలు
- ఎక్కువ స్థానాల్లో గెలిచేలా ప్రణాళికలు
- ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు సవాలే..
- పల్లెల్లో పాగా వేస్తేనే రాజకీయ మనుగడ

ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న 'స్థానిక' పోరుకు షెడ్యూల్ వెలువడింది. మండల, జిల్లా పరిషత్‌లతో పాటు పంచాయతీ ఎన్నికలకు అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల కానుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీలకు సంబంధించి అక్టోబరు 23, 27 తేదీల్లో రెండు విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయి. మరోవైపు, సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి మూడు దశల్లో అక్టోబరు 31, నవంబరు 4, 8వ తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పార్టీ గుర్తులతో, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను పార్టీరహితంగా నిర్వహిస్తారు. క్షేత్ర స్థాయిలో బలంగా ఉంటేనే రాజకీయ మనుగడ సాధ్యం కాబట్టే ప్రధాన పార్టీలు స్థానిక సంస్థలను సీరియస్‌గా పరిగణిస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ పల్లెల్లో పాగా వేయాలనే లక్ష్యంతో సన్నాహాలు చేసుకుంటున్నాయి.


తెలంగాణలో దాదాపు పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికలు కఠిన పరీక్షగా మారాయి. పరిషత్, పంచాయతీ ఎన్నికలు ప్రభుత్వ పనితీరును ప్రతిబింబించనున్నాయి.
ఈ నేపథ్యంలోనే అధికార పార్టీ ఎన్నికలపై సీరియస్‌గా ఫోకస్ చేసింది. రాష్ట్రంలో మెజార్టీ పల్లెలను దక్కించుకోవాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ఈ మేరకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు బాధ్యతలు అప్పగించింది. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం కావాలంటే సర్పంచులు, ఎంపీటీసీలు ఉంటేనే అది సాధ్యమవుతుంది. అందుకే అధికార పార్టీ స్థానిక ఎన్నికలకు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. అధికారంలో ఉండడం అనుకూలంగా మారుతుందన్న భావన నెలకొంది.

### బీఆర్ఎస్‌కు సవాలే..

ఉద్యమ పార్టీగా పాతికేళ్లు, అధికారంలో పదేళ్లు ఉన్న బీఆర్ఎస్ పార్టీ భవితవ్యాన్ని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్ణయించనున్నాయి. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ప్రాభవాన్ని కోల్పోయింది. ఎమ్మెల్యేల ఫిరాయింపులకు తోడు కీలక నేతలు వెళ్లిపోవడం పార్టీకి ఎదురుదెబ్బగా మారింది. ఇక, ప్రధానంగా కవిత రూపంలో పార్టీ అధినేత కేసీఆర్ ఇంట్లోనే మొదలైన ముసలం బీఆర్ఎస్‌ను తీవ్ర చిక్కుల్లో పడేసింది. అదే సమయంలో బీజేపీలో విలీన ప్రచారంతో శ్రేణులు గందరగోళంలో ఉన్నాయి. రాజకీయ మనుగడ ప్రశ్నార్థకమైన తరుణంలో గులాబీ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతో కీలకంగా మారాయి.


### బీజేపీ సన్నాహాలు..

రాష్ట్రంలో పాగా వేయాలని భావిస్తున్న బీజేపీకి స్థానిక ఎన్నికలు సవాలుగా మారాయి. పల్లెల్లో పాగా వేస్తేనే వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై ఆశలు పెట్టుకోవాల్సి ఉంటుంది. దీంతో బీజేపీ స్థానిక సంస్థలపై దృష్టి సారించింది. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలకు బాధ్యతలు అప్పగించనుంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతున్న తరుణంలో అత్యధిక స్థానాలు గెలుచుకుని కాషాయ జెండాను ఎగురవేయాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది.




## దసరా వేళ మాంసం, మద్యం షాపులు బంద్

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** తెలంగాణలో దసరా పండుగను ఘనంగా జరుపుకుంటారు. అయితే ఈ ఏడాది దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ పరిధిలో మాంసం దుకాణాలు బంద్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మాంసం ప్రియులు నిరాశ చెందుతున్నారు. అలాగే మద్యం దుకాణాలు బంద్ ఉండనున్నాయి.




## ఇక నచ్చినట్లు యూపీఐ ఐడీ..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** దేశంలో యూపీఐ లావాదేవీలు బాగా పెరిగాయి. ఈ క్రమంలో యూపీఐ ఐడీని నచ్చినట్లు మార్చుకునే అవకాశం కల్పిస్తూ పేటీఎం, గూగుల్ పే ఆప్షన్ తీసుకొచ్చాయి. ప్రస్తుతం ఫోన్ నంబర్ ఆధారంగా చాలా వరకు లావాదేవీలు జరుగుతున్నాయి. యూపీఐ ఐడీ ఆటోమేటిక్‌గా క్రియేట్ అవుతుంది. అయితే యూపీఐ ద్వారా మోసాలు సైతం పెరగడంతో సంస్థలు చర్యలు చేపట్టాయి. యూపీఐ ఐడీలతో ముడిపడిన వ్యక్తిగత వివరాలను బయట పెట్టేందుకు మోసగాళ్లు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఐడీలను నచ్చినట్లు మెయిల్ ఐడీలా అక్షరాలు, అంకెలతో ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాయి.



## అణు బెదిరింపులకు భారత్ భయపడదు..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అణు బెదిరింపులకు భారత్ భయపడదని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. మిలిటరీ నర్సింగ్ సర్వీసెస్ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడారు. రానున్న రోజుల్లో యుద్ధాల స్వభావం మారిపోనుందన్నారు. అణు బెదిరింపులు, రేడియో ధార్మిక పదార్థాల ప్రయోగాలు వంటి వాటిని యుద్ధతంత్రాలుగా వినియోగించే ఛాన్స్ ఉందన్నారు. అటువంటి చర్యలు నిరోధించడానికి, ప్రభావవంతమైన ప్రతిస్పందన కీలకమన్నారు.



## సూర్యప్రభ వాహన సేవ


తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. బంగారు పూత పూసిన సప్త అశ్వాలతో రూపొందించిన వాహనంపై స్వామివారిని అలంకరించారు. మలయప్పస్వామి సూర్యనారాయణ స్వామి అవతారంలో దర్శనమిచ్చారు. –అక్షరటుడే, తిరుమల

## స్థానిక ఎన్నికలపై ఈటల కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. దీంతో చాలా మంది ఆశావహులు పోటీకి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ కీలక సూచనలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు డబ్బులు ఖర్చు పెట్టొద్దని సూచించారు. ఎన్నికలు ఇప్పుడే ఉండకపోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. తొందరపడి దసరాకు ప్రజలకు దావత్‌లు ఇవ్వొద్దని హెచ్చరించారు. స్థానిక ఎన్నికలు న్యాయపరంగా చెల్లుబాటు అవుతాయో కావోనని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను కోర్టు కొట్టేస్తే ఎలా అని అన్నారు. గతంలో మహారాష్ట్రలో ఎన్నికలు పూర్తయ్యాక కూడా కోర్టు రద్దు చేయడంతో అభ్యర్థులు నష్టపోయారని ఈటల గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో రేవంత్ సర్కార్ డ్రామాలు ఆడుతోందని ఆయన విమర్శించారు.

## తెలుగుతల్లి ఫ్లైఓవర్ పేరు మార్చిన ప్రభుత్వం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ మహానగరంలోని కీలకమైన ఫ్లైఓవర్ పేరు మారింది. లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి సచివాలయం వరకు గతంలో నిర్మించిన ఫ్లైఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్‌గా మార్చుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2005లో నిర్మించిన ఈ వంతెనను గతంలో 'తెలుగుతల్లి ఫ్లైఓవర్' అని పిలిచే వారు. అయితే, తెలంగాణ ఏర్పడి దశాబ్ద కాలం గడిచిపోయినా ఇంకా అదే పేరును కొనసాగించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'గా మారుస్తూ ప్రభుత్వం తాజాగా బోర్డు ఏర్పాటు చేసింది.

## కేంద్ర మాజీ మంత్రి చిదంబరం సంచలన వ్యాఖ్యలు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం సంచలన వ్యాఖ్యలు చేశారు. యూపీఏ హయాంలో ముంబైలో పేలుళ్లు జరిగిన సమయంలో పాకిస్తాన్‌పై చర్యలు చేపట్టేందుకు సిద్ధమైనప్పటికీ, అమెరికా ఒత్తిడి కారణంగా వెనుకడుగు వేసినట్లు వెల్లడించారు. 26/11 ముంబై ఉగ్రవాద దాడుల తర్వాత అంతర్జాతీయ ఒత్తిడి, ప్రధానంగా అమెరికా ఒత్తిడితో పాటు విదేశాంగ మంత్రిత్వ శాఖ వైఖరి కారణంగా తమ ప్రభుత్వం పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోకూడదని నిర్ణయించుకుందని తెలిపారు. ప్రతీకారం తీర్చుకోవాలని తాను వ్యక్తిగతంగా భావించానని, కానీ ప్రభుత్వం సైనిక చర్య తీసుకోకూడదని నిర్ణయం తీసుకుందని చెప్పారు.

## ఇండోనేషియాలో కుప్పకూలిన స్కూల్ భవనం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఇండోనేషియాలో దారుణం జరిగింది. తూర్పు జావా ప్రావిన్స్‌లోని సిడోర్జో పట్టణంలో ఒక ఇస్లామిక్ బోర్డింగ్ స్కూల్ భవనం కూలిపోవడం వల్ల భారీ విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పదుల సంఖ్యలో విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన 'అల్ ఖజోని' ఇస్లామిక్ బోర్డింగ్ స్కూల్లో జరిగింది. నిర్మాణంలో ఉన్న ఈ భవనంలో విద్యార్థులు ప్రార్థనలు చేసుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా భవనం కూలిపోయింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. 100 మంది వరకు పిల్లలు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 8 మందిని ప్రాణాలతో బయటకు తీశారు.

## హెల్త్ సీక్రెట్ చెప్పిన నిహారిక



మెగా బ్రదర్ నాగబాబు తనయ నిహారిక కొణిదెల గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు. మెగా డాటర్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఆమె పలు సినిమాలు చేసింది. 'ఒక మనసు' సినిమా తర్వాత పలు సినిమాలలో కథానాయికగా నటించి ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేసినా మంచి విజయాలు అందించలేకపోయాయి. దీంతో నటనకు కొంత విరామం ఇచ్చి నిర్మాతగా మారింది. ఇదిలా ఉండగా.. తాజాగా నిహారిక తన ఫిట్‌నెస్, డైట్ ప్లాన్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నిత్యం డైట్ ఫాలో అవుతాను అనడం కాదు కానీ, ప్రస్తుతం ఫిట్‌నెస్‌పై ఫోకస్ చేస్తున్నాను. అందుకే నా భోజనంలో ఎక్కువగా మార్పులు చేయకుండా, సింపుల్‌గా & ప్రోటీన్ బేస్డ్ ఫుడ్ తీసుకుంటున్నాను. రోజు నా డైట్‌లో గుడ్డు, చికెన్, డైట్ బిర్యానీ తప్పనిసరిగా ఉంటాయి. ఇదే నా హెల్త్ సీక్రెట్" అని చెప్పింది.

– అక్షరటుడే, సినిమా డెస్క్